# మండూకసంతతి

మాధవరావు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఇంట్లోనుంచి బయటికొచ్చాడు మళ్లా వెనక్కు తిరిగి చూచాడు! తనస్వహస్తాలతో ఎంతో అందంగా, ముచ్చటగా రాసిన మూడుబోర్డులూ మూడు వేపుల వేలాడుతున్నాయి! 'డాక్టర్, మాష్టర్, టైపిస్టు!' ఆ అక్షరాల కుదిరికకు మాధవరావు మరీమరీ మురిసిపోతున్నాడు ఫర్లాంగు దూరంలోవున్న బస్ స్టాప్‌కు వెళ్లేలోపల పదిపర్యాయాలైనా వెనక్కు తిరిగి చూచుకున్నాడు. బస్ స్టాప్ చేరుకునేలోగా మాధవరావుకు మరో సంకల్పం కలగడం, అది మరల వికల్పం కావడంకూడా జరిగిపోయింది! అదేమిటంటే 'ఆర్టిస్ట్' అనే బోర్డుకూడా ఒకటి వేలాడ కడితే కనీసం సైన్‌బోర్డులు రాయించుకునేందుకైనా జనం రాకపోరని! కాని ఇలాచేస్తే మిత్రుడు ఆర్టిస్టు నారాయణ్ణి అవమానపరచినట్లే అవుతుందని ఆ భావనకు స్వస్తిచెప్పాడు!

ఇంతలోకే మాధవరావుకు కావలసిన బస్సువచ్చి స్టాప్‌లో ఆగింది. తన ఆలోచనల్ని కట్టిపెట్టి బస్‌లోఎక్కి కూచున్నాడు! స్టూడియోకు టికెట్ కొనుక్కొని మళ్ళీ ఆలోచనల్లో మగ్నమైపోయాడు మాధవరావు! కండక్టరిచ్చిన చిల్లర లెక్కచూచుకొని జేబులో వేసుకున్నాడు. చిల్లర అంటే ఎంతోగాదు-అణన్నర మాత్రం! ఆ సినిమావాళ్లు రెండు వారాలక్రితం టైప్ చేసిందానికి డబ్బిస్తే మాధవరావు మళ్ళా గూటికి చేరుకోగలడు, లేకపోతే ఐదుమైళ్లు "నటరాజ సర్వీస్"మీద ఆధారపడాల్సిందే! మాధవరావు దీనికీ సంసిద్ధమే. ఎన్ని పర్యాయాలిలా చేయలేదు? ఉద్యోగం కోసం ప్రయత్నించే రోజుల్లో నలుగురు మిత్రులుకలిసిఒకగదితీసుకొని వరసగామూడు మాసాలు 'పాదయాత్ర' చేశారు. 'ఉద్యోగ దాన్' చేసినవాడే కన్పించలేదు! ఎన్ని రోజులు నిరాహారవ్రతం అవలంబించలేదు? కరుణించినవాళ్లు కన్పించలేదు. ఆ ముగ్గురు మిత్రులు ఏమయ్యారో మాధవరావు కింత వరకు తెలీదు! 'నోమోర్ హిరోషిమాస్!' అనే బొమ్మగీచిన నారాయణ 'నోమోర్' యాకర్ గా బతుకుదామని ఈ నగరం చేరిన కోటేశ్వరరావు ఉరఫ్ కోటి గాయబ్! ఇక కథలు రాసుకునే ముకుందం పత్తా బత్తాయించిన వాడూ కన్పించలేదు. ఏమయ్యారు, ఏమిటో ఎవరికీ తెలీదు! పోతే మిగిలింది తనొక్కడే! ఆ ఒక్కడూ మూడేసి వృత్తులు అవలంబిస్తున్నా పొట్ట గడవటమే దుర్భరంగా వుంది.

'హోమియోపతి డాక్టర్ కూడా ఒక డాక్టరేనా' అని జనం పెదవి విరిచారు! ఆ డాక్టర్ పదవికూడా పోస్టల్ ట్యూషన్ చదువుకొని ఆర్జించాడు! ఈ విషయం తెలిస్తే ఆ వచ్చేవాళ్లు కూడా రారేమో? ప్రస్తుతం ఏదో బీదా బిక్కా రావటం, వాళ్లు ఓపినంత ఇవ్వటం జరుగుతోంది! వాళ్ళిచ్చే పావలా, బేడలే ఎన్నో పర్యాయాలు ఆదుకున్నాయి!

ఆ తరువాత కొద్దికాలానికే మాధవరావు మాష్టరుగ కూడా మారాడు, ఇంటింటికీ తిరిగి పిల్లలకు చదువు చెప్పటం ప్రారంభించాడు. తనంతట తాను వెళ్ళి 'మీ పిల్లలకు చదువు చెప్పించుకుంటారా!' అని అడిగినందుకు వాళ్లిచ్చినంత జీతం పుచ్చుకోక తప్పింది కాదు! అయితే ఆ ఇచ్చే జీతం కూడా ప్రతి నెలా నియమంగా ఇవ్వరు! ఎప్పుడైనా అవసరమై అడిగితే- 'ఇదుగో పంతులూ! ముష్టి రెండురూపాయల కోసం పదే పదే అడగాలా? మాకు తెలీదూ ఆ మాత్రం?' అని కసురుకోవడం కూడా కద్దు! ఏదో వేడి నీళ్లకు చన్నీళ్లు తోడుగావుంటాయని చివరకు టైపిస్టుబోర్డుకూడా తగిలించాడు, ఇంటి ముందర! ఈ విద్య ఎప్పుడో పదేళ్లక్రితం శెలవల్లో ఖాళీగా వుండటం ఎందుకులెమ్మని నేర్చుకున్న బాపతు! అది ఈనాటికి ఉపయోగపడింది!

మాధవరావు టైపిస్టుగా మారిన తరువాత మొదటగా తగిలిన బేరం ఈ సినిమా వాళ్లదే కాని వీళ్లేమో పనిచేయించుకొని పదిహేను రోజులు గడిచినా డబ్బివ్వక తిప్పిచంపేస్తున్నారు! మాధవరావు సినిమాలు తీసేవాళ్లను లోలోపల తిట్టుకున్నాడు — 'వీళ్లేమో లక్షలు ఖర్చు పెట్టి సినిమాలు తీస్తారు! కాని స్క్రిప్ట్ టైప్ చేసిన టైపిస్టుకు పాతిక రూపాయలివ్వటానికి అల్లల్లాడతారు!"

మాధవరావు బస్‌లో కూర్చున్న మనుషుల వేపు తేరి పారజూచాడు! వెనక సీట్లో కూర్చున్న చిల్లరపాత్రధారిణీమణులు కాగితపు పూలకుమల్లే కన్పించారు! మధ్యభాగంలో కూర్చున్న ఒకళ్లిద్దరు సినిమాలను గురించి చర్చించుకుంటూ బిగ్గరగా నవ్వుతున్నారు! కండక్టర్ టికెట్లు ఇస్తూ మధ్యమధ్యన స్టాపింగ్ పేర్లు కేకేసి చెబుతున్నాడు! మధ్య సీట్లో కూర్చున్న వ్యక్తులు మాత్రం మాటిమాటికీ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. మాధవరావుకు ఆశ్చర్యం వేసింది—'వాళ్లకు మల్లే నేనెందుకు నవ్వలేకపోతున్నాను? వాళ్లు వేసుకున్న గుడ్డల్లాంటివి తన వంటిమీదలేవేం?' ఇట్లాఆలోచించి మాధవరావు తనలాగా ఎవరైనా ఆబస్‌లో వున్నారేమోనని అందరిమీదికీ దృష్టి సారించాడు! చివరకు తన ముందు సీటులో ఇద్దరు యువకులు కూర్చున్నారు! వాళ్ల మొహంలో ఏదో దైన్యం తొంగి చూస్తోంది. వాళ్లిద్దరూ దేనిమీదనో వాదులాడుకుంటున్నారు. మాధవరావు శ్రద్ధగా విన్నాడు—

—'అంతా అయిపోయింది బ్రదర్! జీతంలో ఒక్క కానీ మిగల్లేదు! మళ్ళీ అప్పుకు బయలుదేరాల్సిందే!'

—నాస్థితీ అలాగే వుంది. రాత్రి సరీగా తిండి తినలేదు! ఇవ్వాళ్ళ ఉదయంనుంచి కాఫీ తాగి నెట్టుకొచ్చాను. ఇప్పటిదాకా!"

మాధవరావు వాళ్ళ మాటలు వినలేకపోయాడు! ఒక్క నిమిషంపాటు కళ్లు మూసుకున్నాడు. ఆ తరువాత బయటికి చూడసాగాడు. బయటున్న చెట్లూ-చేమలూ, ఇళ్ళూ-షాపులూ, ఫుట్‌పాత్ మీద నడిచివెళ్లే మనుషులూ గిరున తిరిగి వెనక్కు జరిగిపోతున్నారు. ఎన్నో గుర్తు

పట్టడానికి వీలులేని మొహాలు గిరగిరతిరిగి పోతున్నాయి! అకస్మాత్తుగా మాధవరావుకు ఆ మొహాల్లో తనభార్య, కూతురూ కన్పించారు! నిన్నటి ఒక సంఘటనకూడా ఆయన కళ్ళెదుట తారట్లాడింది!

—"నాన్నా! ఒక్క కానీ వుంటే ఇవ్వవూ? మధ్యాహ్నంపూట అందరూ ఇళ్ళదగ్గర్నుంచి ఏదో ఒకటి తెచ్చుకుంటారు, తింటానికి! నేను వేరుశనక్కాయలైనా కొనుక్కుంటా!......ఏం నాన్నా. కానీ కూడా లేదా నీదగ్గర?"

'ఏం? ఒక్కరోజు తినకపోతేనేమిటి కేం? రోజులతరబడి తిండిలేకుండా బతికేవాళ్ళు లేరా? ఆకలయినప్పుడు పొట్టనిండా మంచినీళ్లు తాగు! మీ స్కూల్లో మంచినీళ్ళ పంపు లేదూ?'

ఇల్లంతా వెదికి చివరకు మాధవరావు భార్య ఎక్కడో పెట్టి అనుకున దొరికిన అర్థణా తీసుకొచ్చి స్కూలుకు ప్రయాణమై వెళ్ళే ఎనిమిదేళ్ళ కూతురి చేతిలో పెట్టింది......

బస్ టెర్మినస్ లో ఆగింది! మాధవరావు దిగి నాలుగువేపులా కలయజూశాడు! దగ్గరో వున్న టీషాపుకెళ్లి అణా టీ తాగాడు! అర్థణా బెటె సిగరెట్లు కొనుక్కున్నాడు! సిగరెట్ వెలిగించుకుని అట్లా నిల్చున్నాడో లేదో-ఏదో ఒక కారు దుమ్ము రేపుకుంటూ వెళ్లింది! దుమ్ముతోపాటు ఏవో సువాసనలు ఆ చుట్టుపక్కలా వ్యాపించాయి! పక్కగా నిల్చున్న కుర్రాడొకడు......'సినిమా స్టారోయ్' అన్నాడు, ఇంకొకడితో.

అడుగులో అడుగేసుకుంటూ సినిమా కంపెనీవేపు బయలుదేరాడు! ఇంకో పాతికగజాలదూరం ఉందనగా మాధవరావు రెండు చేతులతో తల నున్నగా దిద్దుకున్నాడు! కొంచెం డాబుగా కన్పించక పోతే... గూర్ఖా సెతం లోనికి వెళ్లనీయడు! ఇక లోనికెళ్తే ప్రతి ఒక్కరూ మనిషి తొడుక్కున్న బట్టలవేపే చూస్తారు! ఇందుకే ఇవాళ ఉన్నవాటిలో మంచిబట్ట తీసుకున్నాడు!

మాధవరావు కొన్ని చిన్న చిన్న ఆటంకాల్ని అధిగమించి...ఎట్లాగయితేనేం కంపెనీ అధికారిని కలుసుకొని తను వచ్చిన విషయం తెలియజేశాడు.

'ఓహో! మీరా కాపీస్టుగారూ! టైపింగ్ చార్జి తివ్వాలిగదూ? వచ్చే సోమవారం కన్పించండి, మీకు తెలిసే వుంటుంది-మా యజమాని ఊటీలో వున్నారు! బహుశా ఇంకోవారం నాటికి ఎండలు తగ్గిపోవచ్చును కుంటాను! ఏమంటారు?...ఎండలు చాలా తీక్షణంగా వున్నాయిగదూ?' అని మాధవరావు సమాధానం చెప్పక మునుపే మళ్ళీ 'సోమవారం కన్పించండి!' అని కుర్చీలో నుంచి లేచాడు! మాధవరావు ఏదో చాలా చెప్పాలనుకున్నాడు! కాని నోటి వెంట మాటే రాలేదు. ఈ లోపల ఆ ఉద్యోగి కుర్చీలోనుంచి లేచి నిలబడుతూ 'వస్తా మరి! కొంచెం పనుంది లోపల!' అని చెప్పి లోనికెళ్లిపోయాడు. ఆఖరుసారిగా మాధవరావు పెదాలు వణికాయి! అంతే!!



'గదబ' జాతి యువతి

—ఫొటో: నక్కల మునుస్వామి

మాధవరావు తడారిన పెదాలు నాలుకతో తడిచేసుకుంటూ దిగులుపడిన మొహంతో బయటికి నడిచాడు! సిగరెట్టు తాగాలనీ, వేడివేడి కాఫీ రుచిచూడాలనీ మాధవరావు మనస్సు మహా గుంజాటన పడింది! ఆ పరిసర ప్రాంతాల్లో పరిచితులెవరైనా ఉన్నారేమోనని మాధవరావు గుర్తుకు తెచ్చుకున్నాడు! కాని ఎవరూ లేరు! రైలుస్టేషన్ దాకా వెళ్తే...అక్కడ పున్నారావనే మిత్రుడున్నాడు! ఈ మైలున్నర దూరం 'పాదయాత్ర' చేయాల్సిందే, ఆ పున్నారావును కలుసుకుంటూ!

మాధవరావు రోడ్డు వెంట బయలుదేరాడు! కాఫీహోటళ్ళూ, సిగరెట్ షాపులూ కన్పించాయి! అటువేపు వెళ్లేబస్ కూడా ఖాళీగా వస్తోంది! మనస్సులో కలిగే కోరికల్ని బలి పరుచుకున్నాడు! తన దృష్టిని రోడ్డుమీద లగ్నంచేసి నడక ప్రారంభించాడు!

నడిచి నడిచి...మాధవరావు పున్నారావు గదిని దగ్గరించాడు! ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నకొద్దీ అతనిలో ఏదో చేయరాని పని చేసేప్పుడు కలిగే భయం వేస్తోంది! 'ఇప్పుడు తను పున్నారావును కలుసుకోవటం దేనికి? అతనితో ఏం పని తనకు! ఏం వెళ్లక పోతే?' అని తర్కించు

# ★ మండూక సంతతి ★

కున్నాడు! 'వెళ్తేఏం?' అన్నదిఅతనిమనస్సు. "ఊరికే ఓ పర్యాయం వెళ్ళి మిత్రుణ్ణి చూచి రావటంలో తప్పేముంది? తప్పేముంది? ఏమీ లేదు!"

వెనుకంజ వేస్తున్న మాధవరావును అతని మనస్సు ఈ విధంగా ఆదేశించటంతో వేగం కొంచెం పెంచాడు! ఐదునిమిషాల్లో పున్నారావుగది సమీపించాడు!

లోపల అడుగు పెట్టడంతోటే—పరుపు చుట్టునానుకుని కూర్చున్న పున్నారావు- 'ఓహో! నువ్వటోయ్! — డాక్టర్, మాష్టర్, లైపిస్టూ! ఏమిటి విశేషాలు? ఇలా వచ్చావేంటి? ఇంతదూరం,' అన్నాడు!

ఏఁ రాకూడదా?...అవును గాని ఇంకా ఎన్ని సంవత్సరాలని చదువుతావు! ముసలివాడివయి పోతున్నావు! నీ చదువు చట్టుబండలుగాను — చదువు చాలించి పెళ్లి చేసుకొని హాయిగా ఉండు! నీలాంటి వాడికి ఉద్యోగం రేపిపాటికి రాదూ? పోతే, ఆడపిల్లలకు మనదేశంలో కొదవే లేదు!...ఏమంటావు?...సరే గాని కాఫీ తాగించవోయ్ పున్నారావూ! మర్యాదా—మట్టూ తెలీదేమయ్యా నీకూ?' అన్నాడు మాధవరావు చాపమీద కూర్చుంటూ!

'వచ్చీ రావటంతోటే ఉపన్యాసం మొదలెట్టావు! వ్యవధానం ఏదీ?...కాఫీ రెడీగానేవుంది! నీ అదృష్టం!', పున్నారావు దగ్గర్లోనే వున్న ఫ్లాస్కు మూతతీసి ఒక గ్లాసులో కాఫీ పోసి మాధవరావు ముందుంచాడు.




విజయవాడ స్టాకిస్టులు :
ఎస్కే కార్పొరేషన్ మెయిన్ బజారు.
విజయనగరం స్టాకిస్టులు :
మెసర్సు: మహమ్మద్ యాసిన్ బ్రదర్సు
జనరల్ మర్చంట్సు.

మాధవరావు తాగేశాడు! ఏదో పిచ్చాపాటీ మాటాడుకున్నారు!

మాధవరావుకు సిగరెట్టు తాగాలనిపించింది.! 'ఏం బ్రదర్! నువ్వు సిగరెట్ బీడి తాగకపోతే తాగే వాళ్ళనైనా ఆదరించవా ఏమిటి?...కాఫీ ఇచ్చిన వాడివి సిగరెట్ ఇవ్వకపోతే ఎలాగు?' అన్నాడు మాధవరావు!

అదెంత భాగ్యం! నేవెళ్ళి తీసుకొస్తా! నువిక్కడే కూర్చుని ఈ పాత పత్రికలు తిరిగేస్తూ ఉండు?" అన్నాడు పున్నారావు చొక్కా తొడుక్కుంటూ!

'అక్కర్లేదులే! ఆ డబ్బు లిలాతే! నేనే వెళ్ళి తెచ్చుకుంటాను! నువ్వేదో పాపం చదువుకుంటున్నట్లున్నావు! నీ చదువు భంగం చేయడం నా కిష్టం లేదు.!'

అన్నాడు మాధవరావు లేచి నిల్చుంటూ!

పున్నారావు సరేనని పావలా బిళ్ళ అతని చేతిలో పెట్టాడు.! మాధవరావు మెట్లు దిగి బజార్లో కొచ్చాడు! ఫర్లాంగు దూరంలో వున్న సిగరెట్ దుకాణం దగ్గరికెళ్ళి...'ఒక సార్ ప్యాకెట్' అని పావలా బిళ్ళ అందివ్వబోతుండగా— అప్పుడే తనకు కావలసిన బస్ వచ్చి పక్కనే నిలబడింది. షాప్ తగిలిన వాడికి మరో చెయ్యి వెనక్కు లాక్కుని ఒక్క పరుగున అటువేపుకెళ్ళి బస్‌లో కూర్చున్నాడు!

సిగరెట్ దుకాణమతను వింతగా చూస్తున్నాడు. అంతకంటే వింతగా మాధవరావు తన చేతిలోవున్న పావలాబిళ్ళ వేపు చూశాడు అప్పుడే బస్ కదిలింది. ఆ మరో క్షణంలో నే అతని మనఃఫలకంమీద భార్యా ఎనిమిదేళ్ల కూతురూ కన్పించారు!

బస్ టికెట్ తీసుకొని మాధవరావు మళ్ళీ ఆలోచించసాగాడు — 'తన భార్య ఎంత శాంతి స్వభావురాలు! మిన్ను విరిగి మీద పడుతున్నా తొణకదు! ఉన్న దాంతోనే సరిపెడుతుంది! కూతురుకూడా అచ్చంగా తల్లిలాంటిదే! ఇకతనో? చిటికిమాటకి వాళ్లను కోప్పడుతూంటాడు! చేతిలో కానీ లేక పోవటానికి కారణం భార్యా బిడ్డలేనని భావిస్తాడు!...

తను శ్రమిస్తున్న దానికి ప్రతిఫలం లభిస్తే ఎంత బావుండును? అని అనుకున్నాడు, తన స్థితికి కారకులు తనూ, తన భార్యా పిల్లలు కాక, మరెవ్వరో వున్నారని భావించుకొని!

బస్సు పున్నారావుండే పరిసరప్రాంతాన్ని దాటి చాలాదూరం వచ్చేసింది! ఆ తరువాత రెండో స్టాప్‌లో నే మాధవరావు బస్ దిగాడు!

బస్ దిగి ఇంటివేపుకు వెళ్లాల్సిన మాధవరావు మరో బజారు వేపుకు తిరిగి ట్యూషన్ చెప్పాల్సిన బారిష్టరు గారింటికి వెళ్లాడు!

మాధవరావు బారిష్టరు గారి అందమైన బంగళా పోర్టికోలో అడుగు పెట్టినప్పుడే డ్రాయింగ్ రూంలోవున్న గడియారం ఐదు గంటలు కొట్టింది! మొహంమీద కారుతూన్న చెమట తుడుచుకుంటూ వాకిలిదగ్గర నిల్చొని—'సులోచనా!' అని కేకేశాడు! కేక వేసిన మరో క్షణాన సులోచన పరుగెత్తుకుంటూ బయటి కొచ్చింది! ఆ అమ్మాయిది సరీగా మాధవరావు కూతురి వయస్సే! అందుకనే ఆ అమ్మాయంటే మాధవరావుకు ఎంతో ప్రేమ!

"మాష్టరు గారూ! ఇవ్వాళింత తొందరగా వచ్చారేఁ?...అయినా నా కివ్వాళ పాఠం వద్దూ మాష్టరు గారూ! వైజయంతీమాల డాన్సు ప్రోగ్రాముంది! మీకు తెలీదూ? మీరూ వస్తున్నారా?' అని ఆ పిల్ల అడిగింది అమాయకంగా!

మాధవరావు నవ్వాడు! అది బయటికి నవ్వుగా కన్పిస్తున్నా, నిజానికి అది నవ్వుకాదు, ఏడుపు! ఏడవ లేక నవ్వాడు, అంతే!

"మంచిది వెళ్లిరా అమ్మా! పాఠం ఇవ్వాళ కాకపోతే రేపు చదువుకోవచ్చు! ఇట్లాంటి ప్రోగ్రాములు రోజూ వస్తాయా?...సరే గాని అమ్మాయీ...ఇవ్వాళ ఎన్నో తారీకు!" అనిగాడు మాధవరావు!

"ఏం! అట్లా అడుగుతున్నారు? ఇవ్వాళ పన్నెండో తారీఖు గాదూ?" అన్నది. ఆ అమ్మాయి నవ్వుతూ!

"అయితే మరి కిందటి నెలజీతం తీసుకున్నావా నాన్న గారి నడిగి?"

"తీసుకున్నానండీ! మా అమ్మ తీసుకొని ఖర్చు చేసింది! అమ్మను రెండు సార్లడిగాను! రెండుసారూ—'ఆ పంతులుతో మనం ఊరి విడిచి పారిపోవడం లేదని చెప్పు' అన్నదండి!"

"నిజమేతల్లీ! మీరు పూరువిడిచి వెళ్ళరు! అలా వెళ్ళాల్సింది మేము!...సరే జీతానిదేముందిలే! ఇచ్చినప్పుడే తీసుకుంటాను! రేపొస్తా మరి! వెళ్ళనా?"

వెళ్లిరమ్మంది ఆ అమ్మాయి.

మాధవరావు బారిష్టరు గారి భవ్యమైన బంగళా దాటి బజారున పడ్డాడు! అడుగు తీసి అడుగు వేయటం భారంగా వుంది! ఎట్లాగో నడచి నాలుగు బజార్లూ కలిసిన ఒక కూడలికి చేరుకున్నాడు. అక్కడ అంతా జనం! అంతటా వెలుతురు! వచ్చే పొయ్యే వాళ్ళను తప్పుకుంటూ వెళ్ళి ఒక పక్కన నిలబడ్డాడు!

అక్కడ ఉడిపి హోటల్ వుంది! లోపల్నుంచి రకరకాల సువాసనలొస్తున్నాయి! అద్దం దగ్గర చాల రకాల స్వీట్స్ పెట్టారు! మాధవరావుకు ఆ స్వీట్లు చూడగానే ఏదో ప్రాణం లేచివచ్చినట్లయింది! డబ్బున్నప్పుడల్లా ఇంటికి స్వీట్లు తీసుకెళ్ళడం అలవాటు! ఈసారి డబ్బొస్తే కనీసం పది రూపాయల స్వీట్లయినా కొనాలి అని నిర్ణయించుకున్నాడు!

ఆ వీధి చివరిదాకా నడిచి వెళ్ళాడు! అక్కడ జనసంచారం తక్కువగా వుంది! గోడ పక్కన కూర్చొని ఒక గుడ్డివాడు—మనుషుల అలికిడి విన్నప్పుడల్లా గొంతెత్తి అడుగుతున్నాడు—"బాబూ ఒక్క కానీ ధర్మం చేయండి!" మాధవరావు అతన్ని సమీపించి చూచాడు. గుడ్డివాడి ముందరున్న గుడ్డమీద ఒక చిల్లికానీ కన్పించలేదు!

అతన్ని దాటి వెళ్ళిపోతూ మాధవరావు "అంతే! ఎర్రని ఏగానీ దొరకదు నీకు! అట్లాగే గొంతు చించుకో! నీ బ్రతుకింతే!" అనుకున్నాడు

మాధవరావు సందుగొందులగుండా ఇంటివేపుకు బయలుదేరాడు. అప్పుడే పొద్దు కూకుతోంది. అన్ని ఇళ్లల్లో లైటు వెలుగుతున్నాయి బజారు దీపాలుకూడా అప్పుడే వెలిగాయి మాధవరావు బట్టలు చెమటకు తడిసి ముద్ద ముద్దయ్యాయి. లోపల ఎవరో చేతులు బెట్టి పేగులు దేవుతున్నట్లుగా వుంది! ఒళ్ళంతా వణుకు వణుకుగా కూడా వుంది! కళ్లముందర ఏదో చీకటి తెరలుగా లేస్తున్నది

వీధి మలుపుమీద ఒక్క నిమిషం పాటు నిల్చున్నాడు. పక్కనే కార్పొరేషన్ వాళ్ళ పంపు వుంది! ఆ పంపు పక్కన అంతా తడితడిగా వుంది. అక్కడే ఇద్దరు బయాలజీసూడెంట్సు గాబోలు-నిల్చొని కప్పల్ని గురించి మాట్లాడుకుంటున్నారు! వాళ్లలో ఒకతను బూటు కాలితో ఒక కప్పను తన్నాడు అది ఎగురుకుంటూ వెళ్ళి పక్కనే వున్న బురదలో తల దాచుకుంది!

ఆ రెండో అతను అంటున్నాడు—"ఈ కప్పల శరీరాల్లో ఆరుమాసాలకు సరిపడనీళ్లూ కొవ్వు పదార్థమూ తయారవుతాయి, వరాకాలంలో! వేసవికాలం వాటికి చీకూ చింతా లేదు! వీటిమీదనే ఆధారపడి అవి బతుకుతాయి."

"నిజం! నిజం!" అన్నాడు మొదటివాడు.

మాధవరావు వాళ్లమాటల్ని అతి శ్రద్ధగా విన్నాడు! ఆతరువాత ఇంటివేపుకు బయలుదేరాడు. దారి పొడుగునా మాధవరావు- "నిజంగా మానవుడు కూడా మండూక సంతతికి చెందినవాడైతే ఎంత బావుండేది!" అని మాటిమాటికీ అనుకున్నాడు. ★








మీ క్రొత్త బుష్ షర్టు
క్రుంగకుండా ఉండుటకు
'సాన్ఫొరైజ్డ్'
గురుతును గమనించండి

మామూలు బట్టతో తయారైన దుస్తులు క్రుంగిపోవును. కొంచెము క్రుంగినా సరే మీ మంచి బుష్ షర్టు పాడయి పోతుంది. కాని మీరు కొనే ప్రతి దుస్తుమీద 'సాన్ఫొరైజ్డ్' గురుతును గమనిస్తే మీ దుస్తులు చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవు!

'సాన్ఫొరైజ్డ్' గుర్తుగల బట్ట ముందుగానే, పూర్తిగా క్రుంగించబడినది. ఎన్నో సార్లు ఉతికినా కూడా మీ దుస్తులు చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవు.

'సాన్ఫొరైజ్డ్' గురుతును ఎల్లప్పుడూ గమనించండి!

సాన్ఫొరైజ్డ్. సర్వీస్, 'పారిజాత్', నేతాజీ సుభాష్ రోడ్,
మెరీన్ డ్రైవ్, బొంబాయి 2

రేడియో సిలోన్‌లో 'సాన్ఫొరైజ్డ్-కె-మెహమాన్' ప్రోగ్రామును వినండి.
ఆదివారములు మధ్యాహ్నము 12-45 గం౹లకు 31 మీటర్లమీద.
మంగళవారములు రాత్రి 7-30 గం౹లకు 41 మీటర్లమీద.